క్లుప్తంగా

నేడు గుండ్లకట్టమంచిలో 'గడపగడపకు'

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

21 నుంచి కడపలో టీ-20 మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు సౌత్‌జోన్ ఏసీఏ సీనియర్ మెన్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. అనంతరం సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఆయన ప్రకటించారు.

చెట్టు కూలి చూడి ఆవు మృతి


మృతి చెందిన ఆవు

సోమల: మండలంలోని కందూరు పంచాయతీ పగడాలవారిపల్లెలో చెట్టు కూలి చూడి ఆవు మృతి చెందడం విషాదం నింపింది. ఎండ ఎక్కువగా ఉండడంతో గ్రామానికి చెందిన వెంకటరమణ చూడి ఆవును ఇంటి సమీపంలోని చెట్టుకింద కట్టేశాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి చెట్టు కూలి ఆవుపైన పడింది. సమీపంలోని ప్రజలు గుర్తించి చెట్టును పక్కకు తొలగించి, ఆవును రక్షించారు. అప్పటికే ఆవు మృతి చెందింది. ఈ ఆవు విలువ రూ.60 వేలు అని బాధితుడు వాపోయాడు.

పాముకాటుతో మహిళ మృతి


ప్రభావతి(ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని మేలుపట్లకు చెందిన ప్రకాష్ భార్య ప్రభావతి (55) పాము కాటుకు గురై మంగళవారం మృతి చెందింది. పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా వర్సిటీతో కలిసి పరిశోధనలు


మొహ్మద్ అరిఫుల్లాను సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీతో కలిసి పరిశోధనలు చేపట్టనున్నట్లు మలేషియాలోని క్యాలంటుస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మొహ్మద్ అరిఫుల్లా తెలిపారు. మహిళా వర్సిటీ ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెల్, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆయన్ను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని సత్కరించారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి విహారం


తిరుచ్చిపై స్వామి అమ్మవార్లు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజ స్వామివారు దేవేరులతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజ స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆలయ అధికారులు నాగేంద్ర, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రజల నినాదం.. మా నమ్మకం నువ్వే జగన్

- ప్రభుత్వ పాలనపై హర్షం
- ఇష్టంగా ఇళ్లకు స్టిక్కర్లు


ఐరాల: మిట్టూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి

ఐరాల: ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమ పథకాలు కొనసాగాలని కోరుకుంటున్నారని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పాలనతో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి అన్నారు. మంగళవారం మిట్టూరులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. బుక్‌లెట్‌లో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులు స్వచ్ఛందంగా తమ ఇళ్లకు స్టిక్కర్లను అతికించుకున్నారు.

ఇంటింటా 'జగన్ననే మా భవిష్యత్తు'

పూతలపట్టు: మండలంలోని ఎం.బండపల్లె గ్రామంలో మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం స్టికర్లను, కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఎంపీటీసీ సభ్యులు యతీష్, నిరంజన్‌రెడ్డి, ఎంఎస్‌మణి, ప్రవీణ్, బాలాజీ, షన్ముగం, సచివాలయ కన్వీనర్ జ్యోతిష్వర్, మునిస్వామి, రోజమ్మ, వైస్ సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

యాదమరి: అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని.. ఓటు వేసి దీవించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని లబ్ధిదాల వద్ద ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి గుడిపాలలో విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం మొగరాళ్లపల్లె, 197రామాపురం, కుప్పిగానిపల్లె పంచాయతీల్లో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటికి వచ్చిన సమయంలో వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టంగా తమ ఇళ్లకు స్టిక్కర్లు అంటించుకుంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విక్టర్, ప్రకాష్, జనార్ధన్, రాకేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పూతలపట్టులో సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి


యాదమరిలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో..


గుడిపాలలో..

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

–ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, పక్కన మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కమిషనర్ అరుణ అన్నారు. మంగళవారం నగరంలోని హైరోడ్డు సమీప ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం వస్తే నీరు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పలు వీధుల్లో కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదన్నారు. అలాగే అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు అందించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే గడపగడపకు వస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో అత్యవసరమైన సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సచివాలయాల వారీగా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని స్పష్టం చేశారు. అర్హత ఉండి పలు కారణాలతో పథకాలు ఆగిపోయిన వారికి తిరిగి పథకాలు వచ్చే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్ చల్లాముత్తు, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, రాజా, సీతాపతి, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

నగరంలోని 43వ డివిజన్ రాములవారిగుడివీధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఘనంగా గంగమ్మ జాతర


గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: మండలంలోని శెట్టిన్‌తంగాల్ గ్రామంలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్, యువత అధ్యక్షుడు శిలంబరసన్ పాల్గొన్నారు.

హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్ వేగవంతం చేయండి


బండపల్లి లేఔట్ సందర్శనలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్లు వేగవంతం చేయాలని నగర కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పరిధిలోని బండపల్లె హౌసింగ్ లేఅవుట్లను సందర్శించారు. లేఔట్‌లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం హౌసింగ్, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల సంఖ్య పెరగాలన్నారు. ఇదే సమయంలో రోజువారి స్టేజ్ కన్వర్షన్లు వేగవంతం చేయాలన్నారు.

అధికారులు రోజువారీ లక్ష్యాలతో పాటు, వారాంతపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. మౌలిక సదుపాయాలపై ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఈ వెంకట ప్రసాద్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర రావు, ఏఈ శ్రీలత, హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళంబేడులో రంజాన్ కానుక పంపిణీ


రంజాన్ కానుక అందజేస్తున్న సర్పంచ్

చిత్తూరు రూరల్: మండలంలోని తాళంబేడు పంచాయతీలోని ముస్లింలకు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తన సొంత నిధులతో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తాళంబేడు గ్రామంలోని ముస్లిం కుటుంబాలకు తోఫా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రవిచంద్రరెడ్డి, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల మినీమార్కెట్ యార్డు కోసం వినతి


మంత్రితో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్

బంగారుపాళెం: ఐరాలలో మినీ మార్కెట్ యార్డు మంజూరు చేయాలని బంగారుపాళెం ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్ వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మంత్రిని, అధికారులను కలిశారు. మినీమార్కెట్ యార్డు నిర్మాణానికి పాలక మండలి సైతం ఆమోదం తెలిపిందన్నారు. యార్డు నిర్మాణం కోసం రూ.4.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటరమణ, సూపర్‌వైజర్ గంగయ్య ఉన్నారు.

స్థానిక సమస్యలకు సచివాలయాల్లోనే పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: స్థానికంగా ప్రజా సమస్యలను గ్రామ సచివాలయాల్లోనే పరిష్కరించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పందనలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు



తవణంపల్లె సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీతారెడ్డి, హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గీతారెడ్డి
- గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవు

తవణంపల్లె: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దని ఎంపీపీ గీతారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం తవణంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గీతారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని సమస్యలపై అధికారులు స్పందించడంలేదని.. సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అదే విధంగా మండల మీట్‌కు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అరగొండలో రోడ్డుపై వారపు సంత నిర్వహించడంతో కామాలూరు వైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. సంతకు వేరే స్థలం కేటాయించాలని ఈచనేరి సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. అదే విధంగా భూసమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. దీనిపై తహసీల్దార్ సుశీల స్పందిస్తూ.. ఫిర్యాదు చేసిన వారు గ్రామాలకు వెళితే రావడం లేదని.. ప్రజలు సహకరిస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్అండ్‌బీ రోడ్లకు అడ్డంగా ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను శుభ్రం చేయించాలని సభ్యులు కోరారు. మండలంలోరి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతిని చదివి వినిపించారు. అరగొండలో వారపు సంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బంగారుపాళ్యం సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వైద్యాధికారి దాత్రేయచౌదరి మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, వైస్ ఎంపీపీలు శోభారెడ్డి, పట్నం ప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

–ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆ సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ అధ్యక్షత వహించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ ప్రభుత్వానికి సహకరిస్తున్నామని చెప్పారు. పీఆర్‌సీ, ఐఆర్ కేటాయింపులు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేస్తే లక్షలాది మందికి న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టాలని కోరారు. అనంతరం ఆయన కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ధర్నాలో కలెక్టరేట్ ఉద్యోగులు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎండల దృష్ట్యా అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, నగరంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం నగర పాలక కార్యాలయంలో ఎండ తీవ్రత, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, అత్యవసర మందుల నిల్వ తదితర అంశాలపై ఎంహెచ్ఓ లోకేష్, అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. వేసవిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై కరపత్రాలు ముద్రించి పంచాలని సూచించారు. తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్




ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత, తవణంపల్లె: సరకల్లులో వైద్య పరీక్షలు, గుడిపాలలో..

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని పాలకల-1లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

తవణంపల్లె: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని తవణంపల్లె మండల వైద్యాధికారి మోహన్‌వేలు అన్నారు. మండలంలోని సరకల్లులో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎండాకాలంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదకరమైన వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సుకన్య అన్నారు. వసంతాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రజల వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామస్తులు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.